క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ బీ–బ్లాక్‌లో గురువారం మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని సృజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. కమిటీహాల్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగే ఈవైద్య శిబిరంలో బీపీ, డయాబెటీస్‌లతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేయనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు సైతం చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఐటీ దాడులు



బాచుపల్లిలోని ఎక్సల్ రబ్బర్ ప్రైవేట్ లిమిటెడ్

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎక్సల్ రబ్బర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం ఐటీ దాడులు కొనసాగాయి. దీంతో స్థానికంగా హడావుడి నెలకొంది. పరిశ్రమ పరిసర ప్రాంతాలకు ఎవరూ రాకుండా అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా రవీంద్రభారతి స్కూల్ వార్షికోత్సవం



వినాయకుడి పాటపై విద్యార్థుల నృత్య ప్రదర్శన

నిజాంపేట్: రవీంద్రభారతి స్కూల్ నిజాంపేట్ బ్రాంచ్ వార్షికోత్సవాలు బుధవారం శిల్పకళా వేదికలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఏనుగు నరసింహారెడ్డి, అసిస్టెంట్ జోనల్ ఇన్‌చార్జ్ కిషోర్, డివిజనల్ డీన్ శ్రీలత, డివిజనల్ ఇంఛార్జి హాఫీజ్, ప్రిన్సిపాల్ పూర్ణిమలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయకుడి పాటపై విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అదే విధంగా ప్లాస్టిక్ నిషేధం, నీటి వృథా అవుతున్న తీరుపై సామాజిక సందేశాలతో నృత్య ప్రదర్శన చేశారు.

సర్కారు బడిలో సైంటిఫిక్ రంగోలి పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న డీఈవో విజయకుమారి

దుండిగల్: మల్లంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైంటిఫిక్ రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో విజయకుమారి, గ్లాండ్ ఫార్మా ప్రతినిధులు రఘురామన్, గిరీష్, జన్య ఫౌండేషన్ ప్రతినిధులు జెమిష్, చిరంజీవి హాజరై విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ ముగ్గులు వేసిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశామని ప్రధానోపాధ్యాయుడు సుక్కుబాయి తెలిపారు.

ప్రజా సంక్షేమమే పరమావధి



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని జీడిమెట్ల కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఫస్ట్ ఎవెన్యూ కాలనీలో రూ.30 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డును ముఖ్య అతిథిగా హాజరై ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి, ఫస్ట్ ఎవెన్యూ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, విజయ్, ధనుంజయ్య, శ్రీనివాస్, కిషోర్, నాగేశ్వరరావు, యాదగిరియాదవ్, సత్యం, మురళి, నర్సింగరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లోని పలు కాలనీల్లో వెలసిన ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. అదేవిధంగా గతంలో కొన్ని అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేశామని, త్వరలో వాటిపై చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

రోడ్డును ఆక్రమించి.. నిర్మాణాలు చేపట్టి..!

రాజీవ్ గృహకల్పలో నిబంధనలకు తూట్లు

• రోడ్లపైకి వచ్చేస్తున్న నిర్మాణాలు • పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు



37వ బ్లాక్ వద్ద రోడ్డుకు రెండో వైపు చేపడుతున్న నిర్మాణం

జగద్గిరిగుట్ట: అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప మారింది. రాజీవ్‌గృహకల్ప సముదాయంలో ఎవరికివారు ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ గ్రీన్ బెల్ట్‌ను తొలగించడంతో పాటు రోడ్లను సైతం ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నారు. గతంలో ఈ నిర్మాణాల విషయమై హైకోర్టులో వాజ్యం నడుస్తున్నా అది తమకేమి పట్టదన్నట్లు జోరుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వెనుక సంక్షేమ సంఘం సభ్యులు, అధికార పార్టీ నాయకులు అండదండలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు సంక్షేమ సంఘం సభ్యులు భారీగా వసూళ్లు చేసి అమ్యామ్యాలు అందజేసినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.



23వ బ్లాక్ వద్ద రోడ్డుపైకొచ్చిన నిర్మాణం

◆ 23వ బ్లాక్‌కు ఆనుకుని రోడ్డు వైపు సుమారు 12 ఫీట్‌లు జరిగి కట్టుకుంటున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఇటీవలే అధికారులు వచ్చి హెచ్చరించినా వారి మాటలు బేఖాతరు చేస్తూ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు.

◆ 37వ బ్లాక్ వద్ద ఇంతకు ముందు 8 ఫీట్‌లు రోడ్డు వైపు ఎక్స్‌టెండ్ చేసుకున్నారు. ఇది చాలదన్నట్లు రోడ్డుకు మరో వైపు 8 ఫీట్‌లు జరిగి కట్టుకుంటున్నారు. దీనిపై అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

◆ 49 బ్లాక్ వద్ద ఎక్స్‌టెన్సన్ పేర చేపట్టిన మొదటి అంతస్తులో 3 ఫీట్‌లు పార్క్ స్థలంలోకి జరిగి నిర్మాణం చేపట్టడం విశేషం.

బ్లాక్‌ల మధ్య ఖాళీ స్థలాలు దర్జాగా కబ్జా..

◆ రాజీవ్‌గృహకల్ప బ్లాక్‌ల మధ్య ఎక్స్‌టెన్షన్ పేరుతో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణంలో భవిష్యత్‌లో ఏదైనా విపత్కర ఘటనలు చోటు చేసుకుంటే ఫైర్ ఇంజన్లు, కనీసం అంబులెన్స్‌లు లోనికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఒక వేళ ఆవరణలోకి వెళ్లినా యూటర్న్ చేసుకునేందుకు వీలు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు.

గదుల నెపంతో షటర్లు..

◆ గృహకల్ప సముదాయంలో నివసించే వారు గదులు సరిపోవడం లేదని ఎక్స్‌టెన్షన్ చేపట్టినా మరో వైపు మొదటి అంతస్తులో షటర్లు వేసి షాపింగ్ మాల్స్ నిర్మాణం చేపడుతున్నారు. మొదటి అంతస్తులోకి వెళ్లడానికి మెట్ల దారిని ఐరన్ గ్రీల్ ఏర్పాటు చేయడంతో వీళ్లు గృహకల్ప లబ్ధిదారులేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ సంఘాల ప్రతినిధులే ఎక్స్‌టెన్షన్ పేరిట షటర్లను ఏర్పాటు చేయించి భారీగా అద్దెలు వసూలు చేసేందుకు రూపకల్పన చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మొదటి అంతస్తులో షటర్లు ఏర్పాటు చేసిన దృశ్యం



ఒక బ్లాక్‌కు మరో బ్లాక్‌కు గ్యాప్ లేకుండా చేపట్టిన అదనపు గదులు

నేడు సాక్షి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని చిత్తరమ్మ దేవినగర్ (పీపీ నగర్) రోడ్డు నం.4లో ‘సాక్షి’ఆధ్వర్యంలో సొంటిరెడ్డి పున్నారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (ఎస్పీఆర్) సౌజన్యంతో గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు ముగ్గుల పోటీలు ఉంటాయని తెలిపారు. ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. చుక్కల ముగ్గులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉత్తమ ముగ్గులు వేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులే కాకుండా పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులు ఉంటాయి. వివరాలకు ఫోన్ నం. 96666 55726, 79893 83158 సంప్రదించగలరు.

7న జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్

నిజాంపేట్: కూకట్‌పల్లిలోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో ఈనెల 7న సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా సోషల్ ఫోరం ప్రతినిధులు శివాజీ, మదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శేఖర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పరీక్షపై అవగాహన కల్పించేందుకు, వారిలో ప్రతిభను వెలికి తీయడానికి ఈ టెస్ట్ దోహద పడుతుందన్నారు. ఒక్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు మీడియం నుంచి ఇద్దరు, ఇంగ్లిష్ మీడియం నుంచి ఇద్దరు చొప్పున మొత్తం నలుగురిని పంపించాల్సి ఉంటుందన్నారు. జిల్లా టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన నలుగురు విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు పంపిస్తామని తెలిపారు. ఉదయం 7గంటలకు జరిగే ఈ పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఈ టెస్ట్‌కు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్ విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశాలు ఉన్నాయని మేడ్చల్ జిల్లా విద్యార్థికారి విజయకుమార్ తెలిపారు.

కుత్బుల్లాపూర్‌లో కాషాయ జెండా ఎగరేయాలి

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

కుత్బుల్లాపూర్: బీజేపీలో కష్టపడి పని చేసేవారికి పదవులు వస్తాయని... అదే ఇతర పార్టీలో కాలు మొక్కితేనే వస్తాయని.. పాతా కొత్త తేడా లేకుండా అందరు సమష్టిగా పనిచేసి కుత్బుల్లాపూర్‌లో కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చి రెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ నియోజకవర్గస్థాయి సమావేశానికి అసెంబ్లీ పాలక్ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

◆ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఈనెల 7వ తేదీన జరిగే బూత్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేసినపుడే పార్టీ గెలుపు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

కూన శ్రీశైలంగౌడ్‌తో భేటీ

◆ అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌తో షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో అరుణ భేటీ అయ్యారు. కుత్బుల్లాపూర్‌లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాల గురించి ఈ సందర్భంగా చర్చించారు. కుత్బుల్లాపూర్ పాలక్‌గా నియమితులైన సందర్భంగా డీకే అరుణను శ్రీశైలంగౌడ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న డీకే అరుణ

◆ ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అర్బన్, రూరల్ అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్.మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మూగ జయశ్రీ, కొల్లు మాధవి, వివిధ మోర్చాల నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ పదాధికారులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌తో భేటీ అయిన డీకే అరుణ

ఉత్తరం రాసిపెట్టి.. వెళ్లిపోయిన మహిళ



దివ్య (ఫైల్)

జీడిమెట్ల: ఆర్థిక ఇబ్బందులతో వెళ్లిపోతున్నానని ఓ గృహిణి ఉత్తరం రాసి పెట్టి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ రెడ్డి వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ వినాయకనగర్‌కు చెందిన వెంకట రమేష్, దివ్య(36) భార్యాభర్తలు. వెంకట రమేష్ సుభాష్‌నగర్ ఆటోస్టాండ్ వద్ద జ్యూస్‌స్టాల్ నిర్వహిస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. మంగళవారం సాయంత్రం దివ్య స్కూటీపై రమేష్ నడుపుతున్న జ్యూస్ సెంటర్ వద్దకు వచ్చింది. స్కూటీ తాళాలు రమేష్‌కు ఇచ్చి తాను ఇంటికి వెళ్తున్నానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం రమేష్ ఫోన్ చేసినా దివ్య లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వెళ్లి చూశాడు. దివ్య ఇంట్లో కనిపించలేదు. ఇంట్లో దొరికిన ఉత్తరంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఎక్కడికైనా వెళ్లి చనిపోతానని రాసిపెట్టి ఉంది. దీంతో రమేష్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘చెరువుల పరిరక్షణ పోరాటం ఫలిస్తోంది’

• నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్
• స్టెర్లింగ్ హోమ్స్ కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

నిజాంపేట్: చెరువుల పరిరక్షణకు తాము చేస్తున్న పోరాటం ఫలిస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. బాచుపల్లిలోని చంద్రన్నకుంట చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి కుటుంబం స్టెర్లింగ్ హోమ్స్ పేరిట బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టిందని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో హెచ్‌ఎండీఏ, రేరా, మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చెరువు బఫర్‌జోన్ ఆక్రమణలపై సర్వే చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని హెచ్‌ఎండీఏ అధికారులు జిల్లా అడిషనల్ కలెక్టర్, ఇరిగేషన్ సూపరిండెంట్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్‌కు డిసెంబరు 17న లేఖలు రాసినట్లు సతీష్ పేర్కొన్నారు.

◆ చెరువు స్థలాన్ని గుర్తించాలని.. దానికి అనుగుణంగా నిర్మాణ అనుమతుల్లో మార్పులు చేర్పులు ఉంటాయని.. పూర్తిస్థాయిలో నివేదిక తమకు అందిన తరువాత చర్యలు తీసుకునే వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్‌రిజిస్ట్రార్‌ను హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు కూడా చెరువు ఉన్నా కూడా ఎన్‌ఓసీ ఇవ్వడం.. మున్సిపల్ అధికారులు లోకల్ బాడీ అనుమతులపై కూడా విచారణ చేపట్టాలని కోరారు. చెరువు బఫర్‌జోన్‌లో 12 మీటర్ల వెడల్పు, 120 మీటర్ల పొడవుతో చోటుచేసుకున్న ఆక్రమణలను ఇరిగేషన్ అధికారులే తేల్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. హెచ్‌ఎండీఏ అధికారుల ఆదేశాలను పెడచెవిన పెట్టి నిర్మాణాలు కొనసాగిస్తున్న స్టెర్లింగ్ హోమ్స్ కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరుతున్నారు.

సీఎం సహాయ నిధి పేదల పాలిట సంజీవని

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సీఎం సహాయ నిధి పేదల పాలిట సంజీవని అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్సం పొందిన 55 మంది లబ్ధిదారులకు బుధవారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే రూ.38.17 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అనేక పథకాలు కొనసాగుతున్నాయని, సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది పేద ప్రజలు లబ్ధి పొందారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లను పరిశీలించిన అమెరికా బృందం



మేడ్చల్: 1962 సంచార పశువైద్యశాలలను అమెరికాకు చెందిన విద్యార్థుల బృందం మేడ్చల్‌లో పరిశీలించారు. 1962, 108 అంబులెన్స్‌లను అమెరికాకు చెందిన విస్కోసిస్ యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం మేడ్చల్‌లో సందర్శించి వాటి నిర్వహణ, అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని అధ్యయనం చేశారు. పశువులకు సోకే వ్యాధుల పట్ల పరిశోధన చేశారు. 1962 ప్రాజెక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డా.బాగిష్, మేనేజర్ జాన్ షాహిద్, డాక్టర్లు వినీతరెడ్డి, విఠల్, జిల్లా కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్‌పీ ఆవిర్భావ దినోత్సవం

సుభాష్‌నగర్: మహాజన సోషలిస్ట్ పార్టీని స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం సూరారం ప్రధాన రోడ్డులో రానమల్ల యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులు తోకల చిరంజీవి, శ్రీనివాస్ మాదిగలు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఆరోగ్యశ్రీ, వృద్ధులు, వితంతువుల పింఛన్ల కోసం అలుపెరుగని ఉద్యమాలు చేశామన్నారు. మందకృష్ణ మాదిగ స్థాపించిన ఎంఎస్‌ఎఫ్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిమాదిగ, నరసింహులు, రమేష్‌మాదిగ, దళిత సంఘాల నాయకులు ప్రేమ్ కుమార్, సాంబ, మరాఠీ బస్తీ నాయకులు అశోక్, సంజీవ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు తోకల చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు

అర్చకులు, ఉద్యోగుల నిరసన

కీసర: హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్, రెంజర్ల రాజేష్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కీసర గుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు, ఉద్యోగులు, భక్తులు నిరసన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో తెలంగాణ అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్తి సత్యనారాయణశర్మ, ప్రధాన అర్చకులు బలరామశర్మ, అర్చకులు, ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి పెద్దపీట



సీనియర్ సిటిజన్లకు గుర్తింపుకార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

చింతల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ చంద్రానగర్ కమ్యూనిటీహాలులో బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీనియర్ సిటిజన్లను గత ప్రభుత్వాలు గుర్తించలేదని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఆసరా పింఛన్లతో భరోసా కల్పించామని పేర్కొన్నారు. అదే విధంగా సీనియర్ సిటిజన్లకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ తంగ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు మహ్మద్ మక్సూద్ అలీ, కాలనీ వాసులు డేగ కృష్ణమూర్తి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28 మందికి కోవిడ్ నెగిటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 28 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చాయని వైద్యాధికారులు తెలియజేశారు. కోవిడ్ కొత్త వేరియంట్‌లు విజృంభిస్తున్న నేపథ్యంలో జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలతో బాధపడుతున్న వారు వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం



చంద్రగిరినగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. చంద్రగిరినగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే డివిజన్లో కొట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను పూర్తి చేశామని ఆయన అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో సైతం రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులను చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్, బీసీసెల్ వైస్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, ఉపేందర్‌రెడ్డి, చిన్నగౌడ్, క్రాంతి, ప్రవీణ్, వెంకటేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



శంభీపూర్‌రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు

దుండిగల్: ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు జన్మదిన వేడుకలు బుధవారం అంబరానంటాయి. శంభీపూర్‌లోని కార్యాలయంలో జరిగిన వేడులకు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావడంతో శంభీపూర్ గ్రామం జాతరను తలపించింది. ఈ సందర్భంగా శంభీపూర్‌రాజుతో కేక్‌లు కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జన్మదిన వేడుకల నేపథ్యంలో శంభీపూర్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు వాహనాల రద్దీగా ట్రాఫిక్ జామైంది. మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్ రెడ్డి, నవీన్‌రావు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, సుభాష్‌రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చంద్, తెలంగాణ సివిల్ సప్లై మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, నల్గొండ గద్దర్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీలు రాజు, నవీన్‌రావు, ఎమ్మెల్యే కృష్ణారావు



శంభీపూర్‌రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ